క్లుప్తంగా

సిద్ధాంతి వసంతరాయుడుకు సన్మానం



పేరుపాలెంలో వసంతరాయుడును సన్మానిస్తున్న గ్రామస్తులు

మొగల్తూరు: పేరుపాలెం నార్త్‌కు చెందిన సిద్ధాంతి ఆముదాలపల్లి వసంతరాయుడును శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వాణి ట్రస్టు కుంతి మహేశ్వరి, నంది ఆలయాలకు రూ.10 లక్షలు మంజూరు చేసింది. దీంతో శంకుస్థాపన మహూర్తాలు, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు మహూర్తం పెట్టడం, ఆలయ పనులను ఆయన పర్యవేక్షించడం చేశారు. దీంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ రోజున ఆయన తన సొంత నగదుతో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

30న నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: వాయిదా పడిన నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటి సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 20న నాయినేషన్లు స్వీకరించి, 21న నామినేషన్‌లు పరిశీలిస్తామని చెప్పారు. 22 నుంచి 24 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని చెప్పారు. 30వ తేదీ ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 4.30 గంటలు వరకూ పోలింగ్ నిర్వహించి అదేరోజు ఓట్లు లెక్కిస్తామన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటు పలు పదవులకు ఎన్నిక జరుగుతుందని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: రాయలం ప్రాంతానికి చెందిన వి.రామకృష్ణారావు (62) టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో పడిపోయాడని పోలీసులు తెలిపారు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. అనారోగ్య కారణలతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుని భార్య వేంద్ర ఝాన్సీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రేపు వీఎస్‌కే కళాశాలలో స్కాలర్‌షిప్ టెస్ట్

సాక్షి, భీమవరం: స్థానిక వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఆదివారం ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు కళాశాల సెక్రటరీ వబిలిశెట్టి పట్టాభిరామయ్య తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభ వంతులు, పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ. 3 లక్షలు అందించనున్నామన్నారు. ప్రిన్సిపల్ ఏబీ రమణ మాట్లాడుతూ స్కాలర్ షిప్ టెస్ట్ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమవరం: పాలకోడేరు మండలం వంకాయల పాలెం గ్రామానికి చెందిన పి.ఏసుబాబు (55) తను పండించిన ఆకుకూరలు విక్రయించేందుకు శుక్రవారం భీమవరం వస్తుండగా విస్సాకోడేరు వంతెన సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఏసుబాబును తోటి వ్యాపారులు భీమవరం ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని పోలీసులు తెలిపారు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మంద మాణిక్యానికి డాక్టరేట్



మంద మాణిక్యం

నరసాపురం: వైఎన్ కళాశాల ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొ ఫెసర్‌గా పనిచేస్తున్న మంద మాణిక్యం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క నరసాపురం ప్రాంతంలోనే జరిగే లేసు అల్లికలు, ఎగుమతులు, లేసు అల్లికలు సాగించే మహిళల పరిస్థితి, వారి జీవన విధానం వంటి అంశాలపై చేసిన అధ్యయనానికి గానూ ఆయనకు పీహెచ్‌డీ పట్టా లభించింది. డాక్టరేట్ పొందిన మాణిక్యాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పా రావు అభినందించారు.

యోగాపై అవగాహన

పాలకోడేరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాడు కుముదవల్లి హైస్కూల్‌లో యోగా గురించి వివరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలకోడేరు ప్రకృతిశాల వైద్యుడు సంగెల సృజన పాల్గొని విద్యార్థులకు ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కల్పించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల ఆనంద హేల

ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయడంతో జీవితాల్లో కొత్త వెలుగులు



పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో ఉద్యోగ క్రమబద్ధీకరణ కాబోతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

పాలకొల్లు అర్బన్: కాంట్రాక్టు ఉద్యోగుల కల నెరవేరింది. పలు శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల ఎదురు చూపులకు ఫలితం దక్కింది. సుమారు 22 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య, ఉన్నత విద్యాశాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదల చేసి, డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా, ఆర్డర్ ఆఫ్ మెరిట్‌పై కాంట్రాక్టు పద్ధతిలో ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా నియమితులయ్యారు. వీరంతో గత 22 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేశారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు వీరిని మోసం చేసినట్లు గ్రహించారు. ప్రజా సంకల్పయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10,115 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఆయా పట్టణాల్లో, మండలాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల పరిధిలో కాంట్రాక్టు అధ్యాపకులు 18 మంది, హెల్త్ అసిస్టెంట్లు 43 మంది, ఏఎన్ఎంలు 8 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ముగ్గురు, ఫార్మాసిస్టులు ఇద్దరు పర్మినెంట్ కానున్నారు. దీంతో ఆయా కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందాం



కాంట్రాక్టు అనే బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందాం. గత 22 ఏళ్ల నుంచి అనేక పోరాటాలు చేశాం. పది నెలలకు ఒకసారి జీతం ఇచ్చేవారు. బడ్జెట్ ప్రకారం జీతాలు చెల్లించే వారు. చంద్రబాబు హయాంలో కాంట్రాక్టు ఉద్యోగులు నరకం చూశారు. 10,115 కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌కి జీవితాంతం రుణ పడి ఉంటాం.

– వై.మోహన్‌రావు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు, లంకలకోడేరు పీహెచ్‌సీ

గతంలో ఏడాదికి పది నెలలే జీతం



ప్రతీ మహిళ పెళ్లి అయి న తరువాత బిడ్డకు జన్మనివ్వాలని తపిస్తుంది. అయితే కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన మహిళలు సెలవు పెడితే ఎక్కడ ఉద్యోగం పోతుందోనని మాతృత్వాన్ని కూడా వాయిదా వేసుకున్నాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదిలో 10 నెలలకే జీతాలు ఇచ్చే వారు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే 12 నెలలకు జీతం ఇచ్చారు. కరోనా సమయంలో ఇంట్లో ఉన్నా జీతాలు ఇచ్చారు. గతంలో దినదిన గండంగా జీవించాం. సీఎం జగన్ మాట ఇచ్చారు. దినదినాభివృద్ధి చెందాం. ఈ సంతోషం మాటలతో చెప్పలేకపోతున్నాం. సీఎం జగన్‌కి రుణపడి ఉంటాం.

– ఎస్‌టీవీ సత్యవతి, కాంట్రాక్టు అధ్యాపకురాలు

సీఎం జగన్ కొత్త జీవితం ఇచ్చారు.



సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కొత్త జీవితం ఇచ్చారు. అన్ని అర్హతలు ఉన్నా ఇబ్బందులు పడ్డాం. 22 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో కష్టాలు పడ్డాం, ఎన్నో రాత్రులు నిద్రలేకుండా జీవించాం. అర్హత ఉండి, డీఎస్సీ ద్వారా, మెరిట్ ప్రకారం నియమితులైన తమను క్రమబద్ధీకరించడం సీఎం జగన్‌కి రుణ పడి ఉంటాం.

– మామిడిశెట్టి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ, దొడ్డిపట్ల

కష్టాలు గట్టెక్కాయి...



బీఎస్సీ చదివా. బీఈడీ చేసి ఉంటే లక్ష పైగా జీతం పొందేవాడిని. కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్‌గా అర్హత ప్రకారం, మెరిట్ ద్వారా నియమితులయ్యాను. 22 ఏళ్ల ఎన్నో కష్టాలు పడ్డాను. చాలీ చాలని జీతంతో కుటుంబ పోషణ భారంగా గడిచేది. సీఎం జగన్ దయతో తనలాంటి ఎందరో ఉద్యోగుల కష్టాలు గట్టెక్కాయి.

– గుబ్బల అమ్మిరాజు, పీహెచ్‌సీ, పోడూరు

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను లబ్ధిదారులకు చేరువచేయడంలో చొరవ చూపాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. యలమంచిలి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మాతా సునీల్‌కుమార్ శుక్రవారం పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు



పాతపాడులో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: ప్రధాన కాలువలు వదిలినా ప్రతి శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందెలా పంటబోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం మొగల్తూరు, పాతపాడు,కోమటితిప్ప గ్రామాల్లో పంట బోదెల్లో మట్టి మేటలు వేయడంతో తవ్వకం పనులు చేపట్టారు. వ్యవసాయ పనులు ప్రారంభించే లోపు ప్రతి ఎకరాకు నీరందిలే పంట బోదె తవ్వకం పనులు చేపట్టామని ఏపీఓ వై.శ్రీనివాస్ తెలిపారు.

పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం



ఓడూరులో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న సర్పంచ్ బుర్రా రవికుమార్



చినమల్లంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీ నారాయణ అన్నారు. మండలంలోని చిట్టవరం గ్రామంలో ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారు ఎక్కువ శాతం పేద విద్యార్థులే ఉంటారని వారి తల్లిదండ్రులకు పిల్లల చదువులు ఆర్థిక భారం కాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యాకానుక తదితర పథకాలు ప్రవేశపెట్టారన్నారు. జగనన్న విద్యా కానుకద్వారా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, బ్యాగ్స్, తదితర కిట్‌లను అందజేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు సామ్యూల్‌జాన్, ఉపాధ్యాయురాలు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓడూరులో..

పెనుమంట్ర: పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని ఓడూరు సర్పంచ్ బుర్రా రవికుమార్ అన్నారు. శుక్రవారం ఓడూరు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుందని అందుకు అనుగుణంగా తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సాయిరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు హరివర్మ తదితరులు పాల్గొన్నారు.

చినమల్లంలో..

పెనుగొండ: మండలంలోని చినమల్లం ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యావ్యవస్థలో వచ్చిన నూతన మార్పులను ఉపాధ్యాయులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లే రాంబాబు, డీఆర్‌సీ రాజు, గంట్రేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేరేమిల్లిలో..

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం సృష్టించారని నేరేడుమిల్లి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స జలదుర్గా ప్రసాదరాజు (బుజ్జిరాజు) అన్నారు. నేరేడుమిల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆయన జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం వల్ల పేద విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్య అందేలా జగనన్న చర్యలు తీసుకున్నారన్నారు. దీని వలన రాబోయే రోజుల్లో పేద విద్యార్థులు సైతం ఉన్నత ఉద్యోగాలు సాధించి వారి జీవితాలను తీర్చిదిద్దుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిరిగినీడి పెద్దిరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పెచ్చెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు జల్లి నాగేశ్వరరావు, నామన పెదకాపు, రంగారావు గ్రామ కార్యదర్శి తోటకూర పవన్‌కుమార్‌రాజు హెచ్ఎం పిండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుమిల్లిలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



చిట్టవరంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం

కౌలు కార్డుల మంజూరుకు సహకరించాలి



మేడపాడులో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి

యలమంచిలి: కౌలు కార్డులు మంజూరుకు సొంత భూమిని కౌలుకు ఇచ్చిన రైతులంతా సహకరించాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి కోరారు. మండలంలోని 23 రైతు భరోసా కేంద్రాలలో శుక్రవారం కౌలు కార్డులు మంజూరుపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడపాడు రైతు భరోసా కేంద్రంలో జరిగిన సమావేశంలో దేవి మాట్లాడుతూ తమ భూమిని కౌలుకు ఇచ్చిన చాలామంది రైతులు కౌలు రైతుకు కౌలు కార్డు మంజూరు చేయడానికి అనుమతి ఇవ్వడానికి సంకోచిస్తున్నారని చెప్పారు. కౌలు కార్డుకు కేవలం 11 నెలలు మాత్రమే కాల పరిమితి ఉంటుందన్నారు. అది కూడా కౌలుకు వ్యవసాయం చేస్తున్న కౌలు రైతు తమ పంటకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రం ద్వారా పొందడానికి, పండించిన పంటను అమ్ముకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. కొంత మంది రైతులు కౌలు కార్డుకు అనుమతి ఇవ్వడం వలన భవిష్యత్‌లో తమకు ఇబ్బందులు వస్తాయని భావించి అనుమతి ఇవ్వడం లేదన్నారు. అలా చేయడం వల్ల సాగు చేస్తున్న కౌలు రైతులు ఇబ్బంది పడతారని, ఈ విషయంలో రైతులు సహకరించాలని ఆమె కోరారు. కౌలుకు భూమి సాగు చేస్తున్న కౌలు రైతులంతా సంబంధిత గ్రామ పరిధిలోని వీఆర్వోను కలిస్తే కౌలు రైతు దరఖాస్తు ఇస్తారని, సదరు దరఖాస్తు పూర్తి చేసి దానితోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు ఫోటో ఇస్తే కొత్త కౌలు కార్డు ఇస్తామని దేవి చెప్పారు. ఈ నెలాఖరులోపు కొత్త కౌలు కార్డులు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే రైతులంతా జూలై 10 లోపు నారుమడులు వేయడం పూర్తి చేయాలని ఆమె కోరారు. ఈ సార్వా పంటకు ఎంటీయూ–1064, ఎంటీయూ–1061, ఎంటీయూ–1318 విత్తనాలు అనుకూలంగా ఉంటాయని రైతులు వాటినే విత్తుకోవాలని ఆమె కోరారు. ఆలస్యంగా నారుమడులు వేసే రైతులు మాత్రం ఎంటీయూ–1318 రకం వేయాలని ఆమె కోరారు. ఈ విత్తనాలు నారు పోసిన 155 రోజులకే కోతకు వస్తాయని, కాబట్టి ఆలస్యంగా ఊడ్చే రైతులకు ఈ విత్తనాలు అనుకూలమన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఆమె కోరారు. ముందుగా డబ్బులు చెల్లించిన రైతులకు కిలో విత్తనాలకు రూ.5 సబ్సిడీ వస్తుందని ఆమె వివరించారు. ఈ సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



పెనుగొండలో కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్యామలా సోనీ, తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి

సాగుహక్కు పత్రాలు పంపిణీ

పెనుగొండ: కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న కౌలు సాగు హక్కు పత్రాలను పెనుగొండలో కౌలు రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం పెనుగొండ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో వీటిని సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, తహసీల్దార్ ఎన్. గురుమూర్తి రెడ్డిలు కౌలు రైతులకు అందచేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.స్పందన, గ్రామ కార్యదర్శి ఎస్ఎస్‌వీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగుకు భూసార పరీక్షలు చాలా అవసరం

ఉండి: ఆక్వా సాగు చేపట్టేందుకు కూడా భూసార పరీక్షలు చాలా అవసరమని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు తెలిపారు.లీ మేరకు శుక్రవారం భూసార పరీక్షల ప్రాముఖ్యత, పరీక్షల నిర్వహణపై ఓ ప్రకటన విడుదల చేశబూరు. ప్రతి రైతు తాము పండించే పంటలో నష్టపోకుండా కనీస లాభాలు సాధించేందుకు పంట పండిస్తున్న నేల స్వభావాన్ని తప్పకుండా తెలుసుకోవాలని సూచించారు. లేకుంటే సాంప్రదాయ పద్ధతుల్లో సాగు చేసి తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. మట్టి పరీక్షల వల్ల భూసారం, కావాల్సిన ఎరువుల మోతాదు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలుస్తాయని వివరించారు. అప్పుడు సాగు సులభంగా చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చుని పేర్కొన్నారు. రు.రైతులు కనీసం రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని కోరారు.

సూర్యుడి భగభగలతో ఇక్కట్లు



పెనుగొండలో నిర్మానుష్యంగా మారిన రహదారి

పెనుగొండ: రోహిణీ కార్తె పూర్తి కావస్తున్నా సూర్యుడు భగభగలు తగ్గలేదు. ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత కొన సాగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రోహిణీ కార్తె అఖరులోనైనా ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఎదురు చూపులు చూస్తున్నా వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. మిట్టమధ్యాహ్నమయ్యే సరికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసినా గంటలోనే నిండుకుంటున్నాయి. దుకాణదారులు 12 గంటలకు సర్దేసుకొని తిరిగి సాయంత్రం 5 గంటలకు గాని తెరవలేకపోతున్నారు. ఎండతాకిడికి తోడు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో తొలకరి చినుకులు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు

- పూర్తయిన శ్లాబ్ వర్క్
- రూ.12 కోట్లతో కాళీపట్నం వంతెన నిర్మాణం



చురుగ్గా సాగుతున్న కాళీపట్నం వంతెన నిర్మాణ పనులు

మొగల్తూరు: కాళీపట్నం వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాళీపట్నం తూర్పు నుండి పడమర మీదుగా పాతపాడు వరకు రహదారి, కాళీపట్నం కాలువపై వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతోగత ఏడాది రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజులు శంకుస్థాపన చేశారు. అయితే గత నెల పరిపాలనా అనుమతులు రావడంతో రహదారి, వంతెన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ముదునూరి ప్రసాదరాజు ఆదేశించడడంతో మే మొదటి వారంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. కాలువలు వదిలే లోపు వంతెన శ్లాబ్ పనులు పూర్తి చేయాలని సూచించడంతో సంబంధిత శాఖ అధికారులు వంతెన శ్లాబ్ పనులు పూర్తి చేసి కాలవనీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేశారు.

రహదారికి, వంతెనకు రూ.12 కోట్లు

కాళీపట్నం నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకు వెడల్పు చేసి రహదారి నిర్మాణానికి, కాళీపట్నం కాలువపై రెండు లైన్ల వంతె నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. దీంతో 8మీటర్లు అంటే 3.50 మీటర్ల మేర కల్వర్టువేసి , పది మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మాణం చేపట్టారు. కాలువలు వదిలే లోపు వంతెన పనులు పూర్తి చేయాలని ఆదేశించడంతో వేగంగా పనులు చేపట్టారు. మరో పది, పదిహేను రోజుల్లో వంతెన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

కాళీపట్నం వాసుల చిరకాల కోరిక

సుమారు 3 దశాబ్దాల క్రితం నిర్మించిన కాళీపట్నం వంతెన శిథిలావస్థకు చేరడంతో నూతనంగా వంతెన నిర్మించాలని కాళీపట్నం తూర్పు, పడమర గ్రామస్తులు అనేక సార్లు ప్రజాప్రతినిదుల దృష్టికి తీసుకెళ్లారు. గత టీడీపీ ప్రభుతం అదిగో ఇదిగో అంటూ కాలం గడిపేసింది. అయితే నియోజకవర్గంలోని సమస్యలపై పట్టున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి నూతన వంతెనకు నిదులు మంజూరు చేయడం పనులు కూడా చురుగ్గా సాగుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే మొగల్తూరు మండలంలోని వారితో పాటు కృష్ణా జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గ్రామంలో రూ.2.50 కోట్లతో చేపట్టిన ఆరోగ్య కేంద్రం పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

మరో 15 రోజుల్లో పూర్తి



వంతెన పనులు మరో పదిహేను రోజుల్లో పూర్తి చేస్తాం. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద రాజు ఎప్పటికప్పుడు సమీక్షలు జరపడంతో వంతెన పనులు నెల రోజుల్లోనే పూర్తి చేశాం. రహదారి పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి.

– నిక్కీ క్రజ్, ఏఈ, ఆర్అండ్‌బీ